
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 7 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 41 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8.50

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.2.50, సరాసరి రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.6°/22.4°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

ఉనికి కోసం ఉత్తుత్తి ప్రచారం!

- సానుభూతి పొందేందుకు 'తమ్ముళ్ల' తంటాలు
- 'పచ్చ' కార్యకర్తలకే పార్టీ కండువాలు
- టీడీపీలో చేరినట్లు ఎల్లో మీడియాలో ప్రచారం
- ఫొటోలకు ఫోజులిస్తూ సామాజిక మాధ్యమాల్లోనూ హల్‌చల్
- మద్యం తాగి మరణించినా 'బాబు' ఖాతాలోకే!

సాక్షి, పుట్టపర్తి

అధినేత అవినీతి కేసులో జైలు పాలయ్యాడు.. ప్రజలు పట్టించుకోవడం మానేశారు. నిరసన, ధర్నాలకు పిలుపునిచ్చినా కార్యకర్తలు కన్నెత్తి చూడటం లేదు. ఏం చేయాలో తెలియని పచ్చ తమ్ముళ్లు ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పార్టీ కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఎల్లో మీడియాలోనూ అవే వార్తలు కనిపిస్తుండటంతో జనం నవ్వుకుంటున్నారు.


వాపును బలుపుగా ప్రచారం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేయడంతో చాలా మంది టీడీపీ నేతలూ లబ్ధి పొందుతున్నారు. దీంతో వారంతా ఒక్కొక్కరుగా ఫ్యాన్ కిందకు చేరుతున్నారు. ఈ క్రమంలోనే హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, మడకశిర, రాప్తాడు నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. గ్రామాల వారీగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారు. దీంతో 'తమ్ముళ్ల'కు వణుకు పట్టుకుంది. అవినీతి కేసులో చంద్రబాబు జైలు వెళ్లడం ...టీడీపీ ముఖ్య నేతలు కూడా తలోదారి చూసుకుంటున్నట్లు వార్తలు వస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవడం కష్టమనే భావన కార్యకర్తల్లోకి వెళ్లిపోయింది. అందువల్లే మండల స్థాయి నేతలంతా వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారు. కానీ కొందరు టీడీపీ నేతలు మాత్రం వాపును బలంగా ప్రచారం చేసుకుంటున్నారు. 'తెలుగు తమ్ముళ్ల'కే మళ్లీ కండువాలు కప్పుతూ కొత్తగా టీడీపీలో చేరారంటూ గొప్పలు పోతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవం తెలిసిన జనం మాత్రం వీరి చర్యలు చూసి నవ్వుకుంటున్నారు.

ఏ కారణంతో చనిపోయినా చంద్రబాబు అకౌంటే..

కిందపడినా మాదే పైచేయి అన్నట్లుగా ఉంది టీడీపీ నేతల పరిస్థితి. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేయగా.. కోర్టు సైతం ఆయనకు రిమాండ్ విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపింది. దీన్ని చూపి సానుభూతి పొంది ఓట్లు రాబట్టుకోవాలని టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఏ కారణంతో ఎవరు మరణించినా.. వెంటనే 'చంద్రబాబు అరెస్టు' ఖాతాలో వేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలు జిల్లాలో నాలుగైదు వెలుగు చూశాయి. ఓట్ల వేటలో టీడీపీ నేతల కక్కుర్తి వ్యవహారాలు నచ్చక చాలా మంది అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారు.

- చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ నాలుగు రోజుల క్రితం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తి మండలం నిడిమామిడి నుంచి గంట్ల మారెమ్మ ఆలయం వరకు సంఘీభావ యాత్ర నిర్వహించారు. ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో మద్యం, డబ్బులు ఎరగా వేశారు. ఈ క్రమంలోనే గాజులపల్లికి చెందిన ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోయాడు. కానీ చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకే అతను గుండె ఆగి చనిపోయినట్లు టీడీపీ నేతలు ప్రచారం చేశారు. ఎల్లో మీడియాలోనూ వార్తలు వచ్చాయి. ఇలాంటి ఘటనలు ప్రతి నియోజకవర్గంలోనూ ఉన్నాయి.
- వారం రోజుల క్రితం పెనుకొండలో బీకే పార్థసారథి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు టీడీపీ అనుకూల పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే వారందరూ ఆరంభం నుంచి టీడీపీ వెంట నడిచిన వారేనని తేలింది. అయితే కొంతకాలంగా సవితమ్మ వర్గంలో ఉన్న వారంతా ఇప్పుడు బీకే పార్థసారథి వైపు వచ్చారని తెలిసింది. అలాగే నాలుగు కుటుంబాలు మాత్రమే టీడీపీలో చేరగా.. 40 కుటుంబాలు చేరినట్లు ప్రచారం చేశారు. ఫొటోల్లో జనం భారీగా కనిపించాలన్న ఉద్దేశంతో టీడీపీ కార్యాలయంలోని వారందరికీ కండువాలు వేసి ఫొటోలకు ఫోజులివ్వడం గమనార్హం.



'స్కిల్'తో కిల్..



నిరసనల కోసం హిందూపురంలో ఏర్పాటు చేసిన టెంటు తొలగించిన దృశ్యం

స్కిల్ కుంభకోణంతో సైకిల్ దాదాపుగా 'కిల్' అయ్యింది. చంద్రబాబు జైలులో రిమాండ్ ఖైదీగా ఉండగా... అరెస్టు భయంతో ఆయన తనయుడు లోకేష్ చాలా రోజులు ఢిల్లీలోనే గడిపాడు. 'చంద్రబాబు అరెస్టు'పై చేపట్టిన ధర్నాలు, నిరసనలకు కూడా జనం నుంచి స్పందన లేకపోవడంతో ఒక్కొక్కరుగా టీడీపీ వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నిరసన టెంట్లు ఖాళీ చేశారు. పుట్టపర్తి, హిందూపురంలో టీడీపీ ఏర్పాటు చేసిన నిరసన టెంట్లు ఉన్నట్టుండి తొలగించడమే ఇందుకు నిదర్శంగా చెప్పవచ్చు.

నలుగురు కూడా చేరలేదు



మా గ్రామం నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నేతలు ప్రచారం చేశారు. కానీ వారందరూ టీడీపీలో ఉన్నవాళ్లే. అయితే అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారన్న భయంతో వారికి కండువాలు కప్పి కొత్తగా టీడీపీలో చేరినట్లు బీకే పార్థసారథి ప్రచారం చేశారు. కనీసం నలుగురు కూడా టీడీపీలో చేరలేదు.

– రామాంజనేయులు, కురుబవాండ్లపల్లి

ఉనికి కోసమే



చంద్రబాబు జైలుకెళ్లాడు.. లోకేష్ పారిపోయాడు. వ్యవస్థలను మేనేజ్ చేయడం జగనన్న ప్రభుత్వంలో కుదరదు. ఇక ఆ అవినీతి పరుడు జైల్లో ఉండాల్సిందే. టీడీపీ జీరో అయింది. అందువల్లే ఉనికి చాటుకునేందుకు ఆ పార్టీ నేతలు ఉత్తుత్తి ప్రచారం చేస్తున్నారు. కానీ విజ్ఞులైన జనం అంతా గమనిస్తున్నారు.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

న్యూస్‌రీల్

బీటెక్ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూఏ పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఆగస్టులో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20 రెగ్యులర్), (ఆర్–19 రెగ్యులర్), మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20, 19, 15) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం..

- ఉమ్మడి జిల్లాలో నేడు, రేపు విదేశీ బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి అధ్యయనం చేయడానికి ఆఫ్రికా దేశాలకు చెందిన 27 మందితో కూడిన ప్రతినిధుల బృందం శనివారం, ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నట్లు డీపీఎం లక్ష్మానాయక్ శుక్రవారం తెలిపారు. సెనెగల్, టునీషియా, బెనిన్, మడగాస్కర్, జాంబియా, మలవాయి తదితర దేశాల నుంచి వస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ టి.విజయకుమార్ ఆధ్వర్యంలో విదేశీ బృందం శనివారం ఉదయం 10 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం యగ్నశెట్టిపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానాలను తిలకిస్తుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు అనంతపురం చేరుకుంటారన్నారు. ఆదివారం ఉదయం 9.45 గంటలకు బత్తలపల్లి మండలం గంటాపురంలో పర్యటిస్తారని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సమావేశమై చర్చిస్తారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ జిల్లా పులివెందులకు బయల్దేరుతారని వెల్లడించారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు గెస్ట్ టీచర్ల పోస్టుల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగానూ టీజీటీ గణితం, టీజీటీ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డిగ్రీలో 50 శాతం మార్కులతో పాటూ బీఈడీలో 50 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 9 తేదీ లోపు ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కార్యాలయం, కొడిగెనహళ్లిలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 87126 25065 నంబరును సంప్రదించాలన్నారు.

ఫోర్జరీ సంతకాలతో బిల్లులు స్వాహా

- విచారణ చేపట్టిన విద్యాశాఖాధికారులు



పాఠశాలలో విచారణ చేస్తున్న ఓడీ చెరువు ఎంఈఓ–2 రమణ

తనకల్లు: మండల పరిధిలోని నల్లగుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన 'నాడు– నేడు' పనుల బిల్లులను ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం ఓడీ చెరువు ఎంఈఓ–2 రమణ విచారణ జరిపారు. ఉన్నత పాఠశాలలో 'నాడు– నేడు' పనుల కోసం ప్రభుత్వం రూ.84 లక్షలు మంజూరు చేయగా, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా వ్యవహరించిన ఇంగ్లిష్ టీచర్ (స్కూల్ అసిస్టెంట్) నివేదిత తన సంతకాలను ఫోర్జరీ చేసి బిల్లులు చేసుకున్నారని తవళం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుభాష్ చంద్రబోస్ విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఓడీ చెరువు ఎంఈఓ–2 రమణ శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. మొత్తం ఆరు చెక్కుల్లో తన సంతకాలను ఫోర్జరీ చేసి రూ. 4 లక్షలకుపైగా డ్రా చేసుకున్నారని సుభాష్ చంద్రబోస్ విచారణాధికారి దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల కమిటీ తీర్మాణం లేకుండా బిల్లులు చేసుకున్నట్లు కమిటీ సభ్యులు కూడా తెలిపారు. 'నాడు–నేడు' పనులపై సభ్యులతో ఏ రోజు సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. దీంతో ఇప్పటి వరకు పాఠశాలలో చేపటట్టిన 'నాడు–నేడు' పనులకు సంబంధించిన రికార్డులను చూపించాలని విచారణాధికారి రమణ కోరగా... ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 20 నుంచి 27వ తేదీ వరకూ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా సెలవు పెట్టడం, గత నెల 27వ తేదీ ఇప్పటి వరకు సెలవు పెట్టకుండా పాఠశాల విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. అనంతరం విచారణాధికారి మాట్లాడుతూ... డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాలలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

స్వాహా రాయుళ్లపై చర్యలేవీ?



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ కేతన్‌గార్గ్ సమక్షంలో డీఆర్‌డీఏ అధికారుల తీరును ప్రశ్నిస్తున్న చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి

- డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించిన స్థాయీ సంఘ సభ్యులు

అనంతపురం సిటీ: డ్వాక్రా సంఘాల సభ్యులు పొదుపు చేసుకున్న సొమ్మును సిబ్బంది స్వాహా చేస్తున్నా డీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని చెన్నేకొత్తపల్లి, బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యులు గోవిందరెడ్డి, భాస్కర్ మండిపడ్డారు. పత్రికల్లో వచ్చినప్పుడు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, సమావేశాల్లో లేవనెత్తినప్పుడు ఏదో ఒక ప్రకటన ఇవ్వడం.. ఆ తరువాత స్వాహారాయుళ్లను వదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘం–2, 4 (గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం) సమావేశాలు నిర్వహించారు. జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కరాయసముద్రం, చెన్నేకొత్తపల్లి మండలాల్లో డ్వాక్రా సభ్యుల సొమ్మును భారీగా స్వాహా చేశారని, ఆ మొత్తాన్ని వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు–నేడు కింద హైస్కూల్‌కు ఎనిమిది అదనపు తరగతి గదులు మంజూరు కాగా.. ఎంఈఓ మాత్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని నాలుగు గదులు చాలని రిపోర్ట్ రాశారని చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున మరో నాలుగు గదులు అదనంగా మంజూరు చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి కోరారు.

ప్రజాప్రతినిధులతో పద్ధతిగా మాట్లాడండి

జిల్లా పరిషత్‌లోని అదనపు సమావేశ భవనంలో నిర్వహించిన స్థాయీ సంఘం–5, 6(ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఈఓ లలితా బాయి చర్చను ప్రారంభించారు. జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ ప్రసాద్ తీరును సభ్యులందరూ తప్పుబట్టారు. అభాగ్యులైన పిల్లలకు ఒకట్రెండు సీట్లు సర్దుబాటు చేయలేకపోగా, సిఫారసు చేసిన ప్రజాప్రతినిధులను తక్కువ చేసి మాట్లాడటం తగదని హితవు చెప్పారు. ఇందుకు ఆయన 'నేనింతే'నంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఇంతలోనే జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితా బాయి జోక్యం చేసుకొని స్వరం తగ్గించి మాట్లాడాలంటూ మందలించారు. ప్రజాప్రతినిధులు ఏదైనా విషయంపై అడిగినప్పుడు సంయమనంతో సమాధానం ఇవ్వాలని సూచించారు. గాండ్లపెంట, బత్తలపల్లిలో బాలికల సంక్షేమ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు.

పాడి రైతులకు భారీ రాయితీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో కోటి సూర్యప్రకాష్‌బాబు, అవుటాల రమణారెడ్డి

- సద్వినియోగం చేసుకుని ఆర్థింగా ఎదగాలి
- రైతులు, కాపర్లకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపు



హాజరైన పాడి రైతులు, కాపర్లు

పుట్టపర్తి టౌన్: గొర్రెలు, మేకలు, కోళ్ల యూనిట్లతో పాటు పశుగ్రాస ఉత్పత్తుల కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పశు సంపద మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) పథకం ద్వారా భారీ రాయితీలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని సొంత కాళ్లపై నిలబడటంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించాలని పాడి రైతులు, జీవాల కాపర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో జాతీయ పశు సంపద మిషన్ ఆధ్వర్యంలో రైతులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటిసూర్యప్రకాశ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రోత్సాహరాయితీల గురించి రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... అర్హత కలిగిన పాడి రైతులు, కాపర్లు, నిరుద్యోగ యువత గొర్రెలు, మేకలు, కోళ్ల యూనిట్ల స్థాపన, పశుగ్రాస ఉత్పత్తుల కుటీర పరిశ్రమల ఏర్పాటుకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. రూ.20 లక్షల నుంచి రూ. కోటి విలువ చేసే యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇందులో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే... 40 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం ఉంటుందన్నారు. మిగతా 50 శాతం రాయితీ రూపంలో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అధికారులు మండల, జిల్లా అగ్రిబోర్డు చైర్మన్లను, రైతుభరోసా కేంద్రాల సిబ్బందిని సమన్వయం చేసుకొని గ్రామస్థాయిలోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, గొర్రెలు, మేకల, పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య కమిటీ సభ్యులు నరసింహగౌడ్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాసు, మండల ప్రత్యేక అధికారి రమణయ్య, ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సంపూర్ణ సహకారం

- పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు
- 'కియా', అనుబంధ పరిశ్రమల సందర్శన



కియా యాజమాన్య ప్రతినిధులతో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు, కలెక్టర్ అరుణ్ బాబు తదితరులు



ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమలో తయారైన వాటిని పరిశీలిస్తున్న కార్యదర్శి యువరాజ్

పెనుకొండ రూరల్/ సోమందేపల్లి: పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్రం ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజు అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఎర్రమంచి వద్ద ఉన్న 'కియా' ఇండియాతో పాటు సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమలను సందర్శించారు. తొలుత 'కియా' వద్దకు వెళ్లిన కార్యదర్శి యువరాజు పరిశ్రమలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కియా యాజమాన్య ప్రతినిధులు పరిశ్రమలో తయారయ్యే కార్లు, విడిభాగాలు, వాటి నాణ్యత గురించి వివరించారు. అలాగే అంతర్జాతీయంగా విస్తరిస్తున్న 'కియా' కార్ల అమ్మకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ...పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. 'కియా'కు ఎలాంటి సదుపాయాలు కావాలన్నా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఆయన ఏపీఐఐసీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఇటీవల ఏపీపీఐఐసీ సేకరించిన భూములు, ఆయా భూముల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం..

రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తామని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు తెలిపారు. శుక్రవారం ఆయన సోమందేపల్లి మండలంలోని పేటకుంట సమీపంలోని 'కియా' అనుబంధ పరిశ్రమలను సందర్శించారు. కార్మికుల కల్పిస్తున్న వసతుల గురించి ఆరా తీశారు. ఏపీఐఐసీ సేకరించిన స్థలాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. పరిశ్రమలకు నీటి వసతి, ఇతర సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషాను ఆదేశించారు. పరిశ్రమల సమీపంలో చేపట్టిన పాఠశాలలు, ఆస్పత్రి నిర్మాణాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమలో తయారవుతున్న పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, నాగభూషణం, సోమందేపల్లి తహసీల్దార్ సురేష్ కుమార్, 'కియా' ఇండియా యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

10న హంద్రీ నీవాకు నీరు నిలిపివేత

ఉరవకొండ: వర్షాభావంతో శ్రీశైలం జలాశయంలో తగినంత నీటి లభ్యత లేని కారణంగా ఈనెల 10న హంద్రీ నీవా కాలువకు నీటిని నిలిపివేస్తున్నట్లు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు తెలిపారు. హంద్రీనీవాకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేసేలా ఐఏబీ సమావేశంలో అధికారులు నిర్ణయించారు. హంద్రీనీవా పరిధిలో రైతులు ఎవరూ ఎలాంటి పంటలు సాగుచేసుకోవద్దని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఈఈ రామకృష్ణ యాదవ్ తెలిపారు.

చెరువులకూ బంద్

హంద్రీనీవా పరిధిలోని గుంతకల్లు పరిధిలోని వైటీ చెరువు, పీకె చెరువు, ఆలూరు, గుత్తి సబ్ బ్రాంచ్ కెనాళ్లు, కమ్మకొట్టాల, ఛాయపురం, రాగులపాడు, జిల్లెడు బండట్యాంకు, వెంకటాంపల్లితండా, పందికుంట ట్యాంకు తదితర వాటికి 10 నుంచి నీటి సరఫరా బంద్ కానుంది.

27 గొర్రెల అపహరణ

అమడగూరు: ఓడీ చెరువు మండలంలోని మహమ్మదా బాద్ క్రాస్ సమీపంలోని వంచిరెడ్డిపల్లిలో శిరగం గంగిరెడ్డికి చెందిన 27 గొర్రెలు గురువారం అర్ధరాత్రి అపహరణకు గురయ్యాయి. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గురువారం రాత్రి గంగిరెడ్డి కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున చూడగా మందలో 27 గొర్రెలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అందరికీ రక్ష.. ఆరోగ్య సురక్ష

- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వైద్య శిబిరాలు
- ఇప్పటిదాకా 2,49,457 మందికి సర్వే పూర్తి
- 163 క్యాంపుల ద్వారా వైద్య సేవలు



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇలా..	
జిల్లా జనాభా	4,54,931
సర్వే పూర్తయిన వారి సంఖ్య	2,49,457
మండలాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లు	123
మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లు	40
వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేసిన కేసులు	1100

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా కనీవినీ ఎరుగనిరీతిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఇంటికీ వైద్యసిబ్బంది సందర్శించి బీపీ, షుగర్ లాంటి పరీక్షలు చేస్తూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స పొందుతున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్యంపై ఇంత శ్రద్ధ వహించలేదని జగనన్నకు రుణపడి ఉంటామంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యసేవలు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో కంటి వైద్య నిపుణులు, జనరల్ మెడిసన్ స్పెషలిస్టు, గైనాకాలజిస్ట్, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారు. అత్యసరమైన చికిత్సలు అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్స్‌లో చేర్పి చికిత్సలు అందిస్తారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా కూడా ఉచిత శస్త్ర చికిత్స చేయిస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుల సేవలతో పాటు ఆర్థోపెడిక్, కంటి, జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, పిల్లల వైద్యుల విభాగాలు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో 14 రకాల పరీక్షలతో 120 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా క్యాంపులు..

గత సెప్టెంబర్ 16 నుంచి నేటి వరకూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,54,931 జనాభాలో 2,49,457 మందిని కలిసి సర్వే పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 1,42,929 ఇళ్లు ఉండగా... 86,208 ఇళ్లను వైద్యసిబ్బంది విజిట్ చేశారు. ఈనెలఖరుకల్లా వందశాతం పూర్తిచేయడానికి టార్గెట్‌గా పెట్టుకున్నారు. గత నెల 30వ తేదీ నుంచి నేటి వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో 123 క్యాంపులు, ఏడు మున్సిపాలిటీలో 40 క్యాంపులు పూర్తిచేశారు. 29 వేల మందికి పరీక్షలు చేసి 1100 మంది రెఫర్ చేశారు.

ఆపరేషన్‌కు రెఫర్‌చేశారు



నాపేరు నాగమ్మ కల్లూరులో నివాసముంటున్నాను. నాకు కొంతకాలంగా దగ్గు, ఆయాసం ఉంది. సురక్ష క్యాంపుకు వెళ్లాగా వైద్యపరీక్షలు చేశారు. గుండెకు సంబంధించి ఆపరేషన్ అవసరమని చెప్పారు. ఆస్పత్రికి రెఫర్ చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే ఆపరేషన్ చేయిస్తామని, మందులు కూడా ఇస్తామన్నారు. ప్రజల ఆరోగ్యంపై జగనన్న చూపుతున్న ఆదరణకు రుణపడి ఉంటాం. – నాగమ్మ, కల్లూరు, లేపాక్షి

దేవుడిచ్చిన మనవడు జగన్



కంటిచూపు సరిగ్గా కనపడక ఇంటివద్దనే ఉంటున్న అవ్వతాతలకు దేవుడిచ్చిన మనవడు జగన్. కదిరేపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో పైసా ఖర్చులేకుండా కంటి పరీక్షలు నిర్వహించారు. చూపు తగ్గడంతో అద్దాలు కూడా ఇచ్చారు. అద్దాలు పెట్టుకున్నాక ఎదుటివాళ్లు బాగా కనిపిస్తున్నారు. నాకు సంతోషంగా ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి. – లక్ష్మమ్మ, కంబాలపల్లి, మడకశిర

పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నాం



ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అధిక ఆదరణ లభిస్తుంది. ముందస్తు ప్రణాళిక కన్నా అదనంగా శిబిరాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. ఏ ఇబ్బంది రాకుండా పకడ్బందీగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాం. మందుల సరఫరా మొదలు క్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు ఆయా ఆస్పత్రులకు రెఫరెన్స్ చేసేలా చర్యలు తీసకున్నాం. – కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ

మొక్కజొన్న పంటలో గంజాయి సాగు

అగళి: మొక్కజొన్న పంటలో గంజాయి సాగు చేసిన వారి గుట్టును పోలీసులు రట్టు చేశారు. సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య తెలిపిన వివరాలమేరకు.. పూలపల్లి గ్రామ సమీపంలో రంగారెడ్డి అనే రైతు మొక్కజొన్న పంటలో గంజాయి మొక్కలను సాగు చేశారన్నారు. పక్కా సమాచారంతో శుక్రవారం మొక్కజొన్న పంటను పరిశీలించగా పంట మధ్యలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గంజాయి మొక్కలను తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రంగారెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.



గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య

శ్రీరామిరెడ్డిని ఆదర్శంగా తీసుకోండి

మడకశిరరూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు దివంగత శ్రీరామిరెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా ఎస్పీ కేవీ అశోక్, తుమకూరు సిటీ మున్సిపల్ కమిషనర్ బీవీ అశ్విజ సూచించారు. మండలంలోని నీలకంఠాపురంలో శుక్రవారం స్వర్గీయ శ్రీరామిరెడ్డి 118వ జయంతి వేడుకలు మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలిత స్వర్గీయ శ్రీరామిరెడ్డి సమాధి వద్ద రఘువీరారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో జరిగిన సభ నిర్వహించారు. శ్రీరామిరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గుండుమల బాలుర గురుకుల పాఠశాల జట్టు, హరేసముద్రం పాఠశాల జట్టు విన్నర్, రన్నరప్‌గా నిలిచాయి. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను, ఉత్తమ రైతులకు అవార్డులను అందించారు.



మడకశిర బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

దంపతుల ఆత్మహత్య



మృతులు పవిత్ర , మను (ఫైల్)

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పి రొప్పం గ్రామంలో దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాలమేరకు... రొప్పం గ్రామానికి చెందిన దంపతులు మను (26), పవిత్ర (22) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. కళ్యాణదుర్గం తాలూకా కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన మను తాలూకాలోని పాలకుంట గ్రామానికి చెందిన పవిత్రను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరు చాలా ఏళ్ల క్రితం వలస వచ్చి రొప్పం గ్రామంలో స్థిర పడ్డారు. అయితే టమాట పంటలో నష్టం రావడంతో తీర్చేమార్గం లేక బెంగతో గురువారం రాత్రి మను, పవిత్ర ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక సమాచారంతో సీఐ సురేష్, ఎస్ఐ గురునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేగడి కొత్తూరులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. రేగడి కొత్తూరుకు చెందిన మంజునాథ్‌రెడ్డి (41) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మంజునాథ్‌రెడ్డికి కాలు బాగా దెబ్బతింది. దీంతో చికిత్స కోసం, కుటుంబ పోషణ కోసం పలు చోట్ల రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలీక మానసిక వేదనతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పుట్లూరులో మహిళ ..

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురంలో క్రిష్ణవేణి (47) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. క్రిష్ణవేణి తన భర్త రామాంజినేయులు నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే క్రిష్ణవేణి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నట్లు మృతురాలి కుమార్తె నిరోషా పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

భార్య కళ్లెదుటే భర్త ..

- కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం

అనంతపురం సిటీ: ఒక్కగానొక్క కుమారుడి (4)ని అల్లారు ముద్దుగా చూసుకుంటూ సాఫీగా సాగిపోవాల్సిన ఆ దంపతులు బాంధవ్యం నిత్యం కలహాలతో నరకప్రాయంగా మారింది. ఇక కలసి జీవించలేమనుకున్న ఆ దంపతులు ఆర్నెల్లుగా విడివిడిగానే ఉంటున్నారు. అయినా వారిలో ఏమాత్రం మార్పు రాకపోగా, తరచూ గొడవ పడుతూ బజారు నపడేవారు. ఈ క్రమంలోనే మరోసారి వారిద్దరూ ఇంటి నుంచి గొడవ పడుతూ రైల్వే ట్రాక్ వరకూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆ భర్త.. భార్య కళ్లెదుటే గూడ్స్ రైలు కింద దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం పీటీసీ సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ వివరాలమేరకు.. అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన చంద్రా నాయక్ (33), సోమనాథనగర్‌కు చెందిన లత దంపతులు. వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పీటీసీ సమీపానికి చేరుకున్న దంపతులు నడిరోడ్డుపైనే గొడవకు దిగారు. అంతలోనే గూడ్స్ రైలు రాగా.. ఒక్కసారిగా చంద్రానాయక్ దాని కింద దూరి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్నెళ్ల నుంచి విడివిడిగా ఉంటున్న దంపతులు విడాకుల కోసం ప్రయత్నిస్తూనే వస్తున్నారు. జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముద్దాయిల అరెస్టు

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరంలో బుధవారం రాత్రి భర్త రమేష్ చేతిలో భార్య అంజలి దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముద్దాయిలను ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ నేతృత్వంలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రామదాసులు పోలీసులతో కలసి శుక్రవారం అరెస్టు చేశారు. మృతురాలు అంజలి తండ్రి ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త రమేష్‌ను కళ్యాణదుర్గం వెళ్లే రహదారిలోని గంగవరం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మృతురాలిని వేధిస్తూ ఘటనకు కారణమైన ఓబులేసును రామసాగరం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు.



ముద్దాయిల అరెస్టు చూపుతున్న పోలీసులు

8వ తరగతి విద్యార్థి అదృశ్యం



శశిధర్‌రెడ్డి (ఫైల్)

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన శివారెడ్డి, పావని దంపతుల కుమారుడు శశిధర్‌రెడ్డి అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం గుత్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలమేరకు... శశిధర్‌రెడ్డి గుత్తి మండలం ఇసురాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అక్కడే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. అయితే రెండు రోజుల క్రితం శశిధర్‌రెడ్డి గుత్తిలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అదే రోజు పాఠశాలకు వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే పాఠశాలకు వెళ్లలేదు, ఇంటికి కూడా రాలేదు. దీంతో కంగారు పడ్డ తల్లిదండ్రులు శశిధర్‌రెడ్డి ఆచూకీ కోసం చుట్టు పక్కల గాలించారు. అయినా ఫలితం లేకపోయింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చకచకా హైవే నిర్మాణ పనులు



జగరాజుపల్లి వద్ద రోడ్డును చదును చేసిన దృశ్యం



మట్టి తొలగిస్తున్న వాహనం

- 342 జాతీయ రహదారికి 436 ఎకరాల భూసేకరణ పూర్తి
- 46 కి.మీ రోడ్డుకు రూ.540 కోట్ల వ్యయం
- శరవేగంగా రెండో దశ పనులు

పుట్టపర్తి అర్బన్: జాతీయ రహదారి 342 నిర్మాణ పనులు చక చకా జరుగుతున్నాయి. రెండో దశలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, మట్టి పనులు చేస్తున్నారు.

80 కిలో మీటర్లు.. రూ.850 కోట్లు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని భావించిన ప్రభుత్వం జిల్లాలో జాతీయ రహదారి 342ను నిర్మిస్తోంది. ఈ రోడ్డు పొడవు 80 కిలోమీటర్లు రూ.850 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా మొదటి దశ పూర్తి కానుండటంతో రెండో దశ పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లాలో పరిశ్రమలతో పాటు ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ముదిగుబ్బ, బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల , చిలమత్తూరు మండలాలను కలుపుతూ 342 జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు.

వేగంగా పనులు..

జాతీయ రహదారి నంబర్ 342 రెండో దశ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కదిరి– చెన్నై ప్రధాన రోడ్డుపై ఉన్న ముదిగుబ్బ నుంచి నేషనల్ హైవే 44 కోడూరు వరకూ ఈ రోడ్డును నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకూ డబుల్ లైన్ రోడ్డు సుమారు 34 కిలోమీటర్లు దాదాపుగా పూర్తికావచ్చింది.

నిర్వాసితులకు రూ.65 కోట్లు..

సుమారు రూ.310 కోట్ల వ్యయంతో 34 కిలోమీటర్లు రోడ్డు మొదటి దశ పూర్తి కావచ్చింది. ఇక .. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ ఏర్పాటు కానున్న నాలుగు లైన్ల జాతీయ రహదారిని రెండో దశలో నిర్మిస్తున్నారు. ఈ దశలో 46 కిలోమీటర్ల రోడ్డు నిర్మించనున్నారు. దీని కోసం రూ.540 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఈ రోడ్డుకు సంబంధించి ఇప్పటికే సుమారు 436 ఎకరాల భూమిని సేకరించారు. దీని కోసం ఇప్పటి వరకూ నిర్వాసితుల ఖాతాలకు రూ.65 కోట్లు జమ చేశారు.

మరో 60 ఎకరాల భూమి అవసరం..

రోడ్డు వెంబడి అక్కడక్కడ ఏర్పాటు కానున్న జంక్షన్లకు మరో 60 ఎకరాల భూమి కావాల్సి వస్తుందని డీఈ జగదీష్ గుప్తా తెలిపారు. రెండో దశ పనుల్లో భాగంగా పుట్టపర్తి నగర పంచాయతీలో రోడ్డు చదును చేస్తుండగా రూరల్ మండలం నుంచి కోడూరు వరకూ జంగిల్ క్లియరెన్స్, రోడ్డుకు ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. సమస్యలు లేని చోట, ప్రభుత్వ భూమి ఉన్న చోట, డబ్బు జమ అయిన రైతుల పొలాల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారు. భారీ వాహనాలు వినియోగిస్తూ శరవేగంగా పనులు చేపట్టారు. ఇప్పటి వరకూ ఎక్కడా కోర్టు కేసులు లేవని, అక్కడక్కడా చిన్న చిన్న సమస్యలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.